సాక్షి ఆదిలాబాద్

సోమవారం, 2, జనవరి, 2023



నాగోబా జాతరకు మరో అడుగు

ఉమ్మడి జిల్లాలోని మెస్రం వంశీయులు ఆదివారం కేస్లాపూర్‌లో సమావేశమయ్యారు. అనంతరం గంగాజల సేకరణ పాదయాత్ర ప్రారంభించారు. 10లో▸



'దత్తత'కు మార్గం సులువు

శిశువు 'దత్తత'కు మార్గం సులభతరమైంది. పిల్లలు లేని దంపతులు చట్ట ప్రకారం చిన్నారులను దత్తత తీసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. 8లో▸

గరిష్టం/కనిష్టం
31.0/17.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. గాలిలో తేమశాతం పెరగనుంది. రాత్రివేళలో చలి ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

కలెక్టర్‌కు శుభాకాంక్షల వెల్లువ



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్పీ

కైలాస్‌నగర్: నూతన సంవత్సరం పురస్కరించుకుని పలువురు జిల్లాస్థాయి అధికారులు, రాజకీయ పార్టీలు, వివిధ కుల, ప్రజా, ఉద్యోగ సంఘాల నాయకులు ఆదివారం కలెక్టర్ సిక్తా పట్నాయక్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టరేట్‌లోని క్యాంపు కార్యాలయంలో కలిసిన ఆయా సంఘాల ప్రతినిధులు, అధికారులు ఆమెకు పుష్పగుచ్ఛాలు, బ్లాంకెట్లు, నోట్ పుస్తకాలు, పెన్నులు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి, అడిషనల్ ఎస్పీ శ్రీనివాస్‌రావు, ఆర్డీవో రమేశ్‌రాథోడ్, గిరిజన సంక్షేమశాఖ ఎస్డీసీ వెంకటేశ్వర్లు, పీఆర్ ఎస్ఈ రాజేందర్‌నాయక్, ట్రాన్స్‌కో ఎస్ఈ సంపత్‌కుమార్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్, నాలుగో తరగతి ఉద్యోగులు, స్వచ్ఛందసంస్థల ప్రతినిధులు తదితరులు కలెక్టర్‌ను కలిసి శుభాకాంక్షలను తెలిపారు. పీఆర్‌టీయూ, ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్లను కలెక్టర్ ఆయా సంఘాల ప్రతినిధులతో కలిసి విడుదల చేశారు.

డిగ్రీ కళాశాల ఏవోపై బదిలీ వేటు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ సైన్స్ డిగ్రీ కళాశాలలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (ఏఓ)గా పనిచేస్తున్న సీహెచ్ అరవింద్‌పై ఇంటర్ విద్యాశాఖ కమిషనర్ నవీన్‌మిట్టల్ బదిలీ వేటు వేశారు. కళాశాలలోని నాన్ టీచింగ్ సిబ్బంది, ఫిజికల్ డైరెక్టర్, కెమిస్ట్రీ లెక్చరర్లను ఏవో వేధింపులకు పాల్పడడం, భయభ్రాంతులకు గురిచేయడంతో కళాశాల యాజమాన్యం అక్టోబర్ 25న కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. వీరితో పాటు కళాశాలలోని ఇద్దరు లెక్చరర్లకు సంబంధించి పీహెచ్‌డీ ఇంక్రిమెంట్ చేయకపోవడం, మరో లెక్చరర్‌కు సంబంధించి జీపీఎఫ్ నిధులను మరో వ్యక్తి ఖాతాలో జమ చేయడం తదితర కారణాలతో ఆయనను వనపర్తి డిగ్రీ కళాశాలకు బదిలీ చేశారు. అక్కడ పనిచేస్తున్న ఇర్ఫాన్ అహ్మద్‌ను ఆదిలాబాద్ సైన్స్ డిగ్రీ కళాశాలకు బదిలీ చేస్తూ శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ అయ్యాయి.

బేల వార్డెన్ రవీందర్ సస్పెన్షన్

కైలాస్‌నగర్: విధులకు గైర్హాజరు కావడంతో పాటు విద్యార్థులకు నాసిరకం భోజనం పెట్టిన బేల మండల కేంద్రంలోని ఎస్సీ వసతిగృహ సంక్షేమాధికారి బొంపల రవీందర్‌పై సస్పెన్షన్ వేటు పడింది. తమకు నాసిరకం భోజనం పెడుతున్నారంటూ ఆ వసతి గృహ విద్యార్థులు డిసెంబర్ 25న బేల అంతర్రాష్ట్ర రహదారిపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. దీనిని సీరియస్‌గా పరిగణించిన కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఘటనపై విచారించాల్సిందిగా ఏఎస్‌డబ్ల్యూవో నారాయణరెడ్డిని ఆదేశించారు. మరుసటి రోజు వసతిగృహాన్ని సందర్శించి విచారించగా అధికారుల నుంచి ఎలాంటి అనుమతుల్లేకుండా సదరు వార్డెన్ విధులకు గైర్హాజరైనట్లుగా నిర్ధారించారు. నాసిరకం భోజనం పెడుతున్నట్లుగానూ గుర్తించారు. ఈమేరకు కలెక్టర్‌కు నివేదిక అందించగా వార్డెన్‌ను విధుల నుంచి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేసినట్లుగా జిల్లా దళిత అభివృద్ధి శాఖ అధికారి సునీతకుమారి తెలిపారు. తాత్కాలికంగా ఏఎస్‌డబ్ల్యూవో నారాయణరెడ్డికి ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించినట్లుగా పేర్కొన్నారు.

'కలెక్టర్‌ను బదిలీ చేయాలి'



మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

ఎదులాపురం: కలెక్టర్ సిక్తా పట్నాయక్ వెంటనే బదిలీ చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా ఎన్‌ఆర్‌ఈజీఎస్‌లో అక్రమాలు జరిగాయని, రూ.కోట్ల ప్రజాధనం దుర్వినియోగం అయినట్లు ఆరోపించారు. వ్యవసాయ శాఖలో విత్తనాల పంపిణీలోనూ రూ.లక్షల్లో అవినీతి జరిగినా, ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నా కలెక్టర్ పట్టించుకోవడం లేదన్నారు. అక్రమ మైనింగ్, ఇసుక తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నా పట్టింపు లేకుండా వ్యవహరిస్తూ కుర్చీకే పరిమితమవుతున్నారన్నారు. వెంటనే కలెక్టర్‌ను బదిలీ చేయాలని, లేని పక్షంలో సెక్రటేరియేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు దేవేందర్, రాములు, బీకేఎంయూ జిల్లా కార్యదర్శి రమేశ్, సీనియర్ నాయకులు నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.



ఇంటి కనెక్షన్‌కు వ్యవసాయ బిల్లును అనుసంధానం చేసి జారీ చేసిన బిల్లు

'కరెంట్' బిల్లు.. కలిపేశారు!

జిల్లాలో	
వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు	29,668
వీటి బకాయిలు	రూ.6.12కోట్లు

- ఆదిలాబాద్‌రూరల్ మండలం యాపల్‌గూడ గ్రామానికి చెందిన మార్కండేయ అనే రైతు పేరిట గల 60114–00094 వ్యవసాయ సర్వీస్ కనెక్షన్‌పై రూ.7,081 బిల్లు పెండింగ్‌లో ఉంది. దీర్ఘకాలంగా చెల్లించకపోవడంతో బకాయిలు పేరుకుపోయాయి. వాటిని రాబట్టుకునేందుకు విద్యుత్ సంస్థ ప్రస్తుతం ఆయన ఇంటి సర్వీస్ కనెక్షన్ నంబర్ 60114–00007కు ఆ బిల్లును అనుసంధానం చేశారు.
- ఆదిలాబాద్‌రూరల్ మండలం అంకోలి గ్రామానికి చెందిన రైతు సంటెన్న వ్యవసాయ సర్వీస్ కనెక్షన్ 030900601పై రూ.1,227 బిల్లు బకాయి ఉంది. దీన్ని వసూలు చేసేందుకోసం ఆయన ఇంటి సర్వీస్ నంబర్ 60113–00229కు బిల్లును అనుసంధానం చేసింది విద్యుత్ సంస్థ.

- వ్యవసాయ విద్యుత్ బిల్లు.. ఇంటి కనెక్షన్‌తో అనుసంధానం
- కస్టమర్ సర్వీస్ చార్జీని ఏళ్లుగా చెల్లించని రైతులు
- పేరుకుపోయిన బకాయిలు..
- వసూలుపై విద్యుత్‌శాఖ దృష్టి



విద్యుత్‌శాఖ కార్యాలయం

కైలాస్‌నగర్: వ్యవసాయ సాగుకు సంబంధించిన బకాయిలు విద్యుత్‌శాఖకు తలనొప్పిగా మారాయి. జిల్లావ్యాప్తంగా కోట్లలో బకాయిలు పేరుకుపోయాయి. రైతాంగానికి ప్రభుత్వం ఉచిత విద్యుత్ అందిస్తున్నా కస్టమర్ సర్వీస్ చార్జీ పేరిట రోజుకు రూ.1 చొప్పున ఏడాదికి రూ.360 వసూలు చేస్తున్నారు. జిల్లాలో చాలామంది రైతులు దీర్ఘకాలంగా వీటిని చెల్లించకపోవడంతో బకాయిలు కోట్లలో పేరుకుపోయి ఆసంస్థకు గుదిబండగా తయారయ్యాయి. నష్టాల బారిన పడుతుండటంతో ఎట్టకేలకు వీటి వసూళ్లపై విద్యుత్‌శాఖ దృష్టి సారించింది. పెండింగ్ బిల్లుల బకాయిలు రాబట్టుకునేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టింది. రైతు పేరిట ఉన్న సాగు విద్యుత్ కనెక్షన్ బిల్లును, వారి ఇంటి సర్వీస్ కనెక్షన్లకు లింక్ చేస్తున్నారు. ఈ నెలకు జారీ చేసిన ఇంటి బిల్లులో వ్యవసాయ కనెక్షన్ బకాయిల బిల్లును కలిపారు. దీంతో రైతులు తప్పనిసరిగా వీటిని చెల్లించాల్సి వస్తోంది. బకాయిలు వసూలుపై ఉన్నతాధికారులు ఫోకస్ చేసి డీఈ, ఏడీ, ఏఈలకు ప్రత్యేక టార్గెట్లను నిర్దేశించారు. దీంతో వారంతా బకాయిల వసూలు కోసం గ్రామాల బాట పడుతున్నారు.

రూ. కోట్లలో బకాయిలు..

జిల్లావ్యాప్తంగా 18 మండలాల పరిధిలో 29,668 వ్యవసాయ సాగుకు సంబంధించిన విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. రైతులకు ప్రభుత్వం ఉచిత విద్యుత్ సరఫరా చేస్తుండగా కస్టమర్ సర్వీస్ చార్జీల పేరిట రోజుకు రూ.1 చొప్పున ఏడాదికి రూ.360 వసూలు చేస్తోంది. కొంతమంది రైతులు సక్రమంగా చెల్లిస్తున్నారు. అయితే ప్రభుత్వం ఉచితవిద్యుత్ ఇస్తుంది కదా అనే భావనతో సీసీ చార్జీలపై అవగాహన లేక చాలా మంది చెల్లించడం లేదు. దీంతో ఒక్కో రైతు వేలల్లో బకాయిపడ్డారు. ఇలా జిల్లావ్యాప్తంగా రూ.6.59 కోట్లు బకాయిలుపేరుకుపోయాయి.ఈక్రమంలో వాటి వసూళ్లపై విద్యుత్‌శాఖ దృష్టి సారించడంతో ఈ నెల రూ.46.75లక్షలను వసూలుచేశారు.ఇంకా రూ.6.12 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిని సైతం వసూలు చేసేలా ఇంటి నంబర్లకు అనుసంధానం చేశారు. విద్యుత్ శాఖ డీఈ నుంచి క్షేత్రస్థాయిలో బిల్లు వసూలు చేసే సిబ్బంది వరకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. దీంతో వారంతా ఈ బకాయిలు రాబట్టే పనిలో నిమగ్నమయ్యారు.

మండలాల వారీగా పేరుకుపోయిన సాగు విద్యుత్ యూజర్‌చార్జి బకాయిలు

మండలం	వ్యవసాయ సర్వీస్ కనెక్షన్లు	కస్టమర్ యూజర్‌చార్జి బకాయిలు (రూ.లక్షల్లో)
ఆదిలాబాద్‌రూరల్	2584	56.73
మావల	396	20.80
తాంసి	1634	25.49
తలమడుగు	2951	47.94
భీంపూర్	1174	26.58
జైనథ్	3524	77.18
బేల	1189	21.83
ఇచ్చోడ	1615	47.96
బజార్‌హత్నూర్	1738	45.34
బోథ్	4235	76.45
నేరడిగొండ	1900	22.57
ఉట్నూర్	1722	49.74
నార్నూర్	767	14.44
ఇంద్రవెల్లి	1596	35.22
గుడిహత్నూర్	1539	27.54
సిరికొండ	1104	17.00

బకాయిల వసూలుపై ప్రత్యేక దృష్టి

పెండింగ్‌లో ఉన్న వ్యవసాయ కనెక్షన్లకు సంబంధించిన బకాయిల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాం. కస్టమర్ యూజర్ చార్జీలు దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్నందున వాటిని రాబట్టుకునేందు కు ఇంటి కనెక్షన్లకు వ్యవసాయ కనెక్షన్ల బిల్లులను అనుసంధానం చేశాం. బకాయిలు వసూలు చేసేలా డీఈ, ఏఈలకు ప్రత్యేక ఆదేశాలు ఇచ్చాం. ఈ నెలాఖరుకల్లా బకాయిలన్నింటినీ వసూలు చేస్తాం. – కె.సంపత్‌కుమార్, విద్యుత్‌శాఖ ఎస్ఈ, ఆదిలాబాద్

చిన్నారుల మోములో చిరునవ్వు



తప్పిపోయిన చిన్నారులను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న అధికారులు (ఫైల్)

- నేటి నుంచి ఆపరేషన్ స్మైల్–9
- బాలకార్మికులకు విముక్తి
- తల్లిదండ్రుల చెంతకు తప్పిపోయిన చిన్నారులు
- ఏడేళ్లలో 2,170 కేసులు పరిష్కారం
- నెల పాటు కొనసాగనున్న కార్యక్రమం

ఆదిలాబాద్‌టౌన్: బాల్యం బందీ కాకుండా పోలీసు, బాలల సంరక్షణ శాఖల ఆధ్వర్యంలో ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్ వంటి కార్యక్రమాలను ప్రభుత్వం ఏటా చేపడుతోంది. బడిలో గడపాల్సిన బాలలు చాలామంది హోటళ్లు, లాడ్జీలు, ఇటుకబట్టీలు, చెత్త సేకరణ పనుల్లో నిమగ్నమవుతున్నారు. పుస్తకాలతో కుస్తీ పట్టాల్సిన వారంతా దుర్భర జీవితం గడుపుతున్నారు. ఇలాంటి వారికి విముక్తి కలిగించి వారి మోములో వెలుగులు నింపేందుకే ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపడుతోంది. తల్లిదండ్రుల నుంచి తప్పిపోయిన చిన్నారులను చెంతకు చేర్చడం, వారిని పని నుంచి విముక్తి కల్పించేందుకు ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు 2015 నుంచి నిర్వహిస్తున్నారు. ఐసీపీఎస్, పోలీసు, కార్మిక శాఖల ఆధ్వర్యంలో ఏడాదికి రెండుసార్లు (జనవరి, జూలైలలో) నెల పాటు చేపడుతున్నారు. తప్పిపోయిన చిన్నారుల ఆచూకీ తెలుసుకొని తల్లిదండ్రుల చెంతకు చేర్చుతున్నారు. పిల్లల బంగారు భవితకు బాటలు వేస్తున్నారు. నేటి (సోమవారం) నుంచి 31 వరకు కార్యక్రమం కొనసాగనుంది.

జిల్లాలో రెండు బృందాలు..

హోటళ్లు, రైల్వేస్టేషన్, బస్టాండ్, ఇటుకబట్టీలు, మెకానిక్ షెడ్లు తదితర ప్రాంతాల్లో బాలకార్మికులుగా పనులు చేపడుతున్న వారిని వాటి నుంచి విముక్తి కల్పించడమే ఆపరేషన్ స్మైల్ లక్ష్యం. రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన బాలలను సైతం వారి తల్లిదండ్రుల చెంతకు చేర్చుతున్నారు. జనవరిలో ఈ కార్యక్రమం కొనసాగుతుంది. జిల్లాలో రెండు బృందాలుండగా..ఆదిలాబాద్ పరిధిలో ఒకటి, ఉట్నూర్ పరిధిలో ఒకటి ఉంది. వీటికి ఎస్సైలు ఇన్‌చార్జీలుగా ఉంటారు. ఒక్కో బృందంలో నలుగురు కానిస్టేబుళ్లు, నలుగురు ఐసీపీఎస్ సిబ్బంది, కార్మిక శాఖాధికారులు ఉంటారు. వీరు తప్పిపోయి తిరుగుతున్న చిన్నారులను గుర్తిస్తారు. సీడబ్ల్యూసీ ముందు హాజరుపర్చి వారి తల్లిదండ్రులకు అప్పజెబుతారు. గతేడాది జూలైలో నిర్వహించిన ఆపరేషన్ ముస్కాన్‌లో 41 మందిని పని నుంచి విముక్తి కల్పించినట్లు అధికారులు చెబుతున్నారు.

యథాస్థితికి..

తప్పిపోయిన చిన్నారులను వారి తల్లిదండ్రుల చెంతకు చేర్చేలా ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నప్పటికీ పూర్తిస్థాయిలో పిల్లల మోములో చిరునవ్వులు కనిపించకుండా పోతుందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కొన్ని రోజులకే మళ్లీ యథాస్థితికి చేరుతోంది. కార్యక్రమాన్ని నిరంతరం చేపడితేనే ప్రయోజనం చేకూరుతుందని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

బాలలను పనిలో పెట్టుకుంటే చర్యలు



బాలలను పనిలో పెట్టుకుంటే యజమానులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేస్తాం. ఎక్కడైనా మైనర్లను పనిలో పెట్టుకున్నట్లు సమాచారం అందితే తనిఖీలు చేపడతాం. ఆపరేషన్ ముస్కాన్, ఆపరేషన్ స్మైల్ కార్యక్రమాల ద్వారా తప్పిపోయిన, బందీ అయిన చిన్నారులకు విముక్తి కలిగిస్తున్నాం. – రాజేంద్ర ప్రసాద్, ఐసీపీఎస్ అధికారి, ఆదిలాబాద్

సంవత్సరం	ఆపరేషన్ స్మైల్ ద్వారా విముక్తి అయిన చిన్నారులు	ఆపరేషన్ ముస్కాన్ ద్వారా విముక్తి అయిన చిన్నారులు
2017	144	147
2018	149	163
2019	62	311
2020	--	--
2021	113	72
2022	55	41

మారిన జిల్లా పోలీసు అధికారుల ఫోన్‌నంబర్లు

- ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాతో పాటు ఆదిలాబాద్, ఉట్నూర్ సబ్‌డివిజన్ పరిధిలోని పోలీసు అధికారుల అధికారిక ఫోన్ నంబర్లు మారినట్లు ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి ఆదివారంప్రకటనలో తెలిపారు. గతంలో పోలీసు అధికారుల వద్ద ఉన్న అధికారిక నంబర్లు ఇకపై పనిచేయవని, విషయాన్ని ప్రజలు గమనించాలని సూచించారు. సోమవారం నుంచి కొత్త నంబర్లలో అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు.

కొత్త ఫోన్ నంబర్లు ఇవే..

ఆదిలాబాద్ ఎస్పీ	8712659900
అదనపు ఎస్పీ పరిపాలన	8712659901
ఆదిలాబాద్ డీఎస్పీ	8712659914
ఉట్నూర్ డీఎస్పీ	8712659935
స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్	8712659904
సబ్ ఇన్‌స్పెక్టర్	8712659905
సీసీఎస్ సీఐ	8712659965
ఆదిలాబాద్ సబ్ డివిజన్.. సీఐలు	
ఆదిలాబాద్ రూరల్	8712659915
జైనథ్	8712659916
బోథ్	8712659917
ఆదిలాబాద్ వన్‌టౌన్	8712659918
ఆదిలాబాద్ వన్‌టౌన్	8712659919
ఆదిలాబాద్ టూటౌన్	8712659920
ఆదిలాబాద్‌టూటౌన్	8712659921
ట్రాఫిక్	8712659922
ఉమెన్ పోలీస్ స్టేషన్	8712659923
ఎస్సైలు..	
ఆదిలాబాద్‌రూరల్	8712659924
మావల (1)	8712659925
మావల(2)	8712659926
తాంసి	8712659927
తలమడుగు	8712659928
జైనథ్	8712659929
బేల	8712659930
భీంపూర్	8712659931
బోథ్(1)	8712659932
బోథ్(2)	8712659933
బజార్‌హత్నూర్	8712659934
ఉట్నూర్ సబ్ డివిజన్.. సీఐలు	
ఇచ్చోడ	8712659936
ఉట్నూర్	8712659937
నార్నూర్	871265993
ఎస్సైలు	
ఉట్నూర్	8712659939
ఉట్నూర్(2)	8712659940
ఇంద్రవెల్లి	8712659941
నార్నూర్	8712659942
గాదిగూడ	8712659943
ఇచ్చోడ	8712659944
ఇచ్చోడ (2)	8712659945
గుడిహత్నూర్	8712659946
నేరడిగొండ	8712659947
సిరికొండ	8712659948
డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్	8712659951
షీటీం	8712659953
ఎస్పీ పీఆర్వో	8712659971
జిల్లా వాట్సాప్ నంబర్	8712659973

ఆయిల్‌పాం దిశగా అడుగులు



ఈ ఫొటోలో కనిపిస్తున్న రైతు ఖుర్షిద్. ఈయనది తాంసి మండలం వద్దాడి గ్రామం. తనకు ఐదెకరాలు ఉండగా.. మూడున్నర ఎకరాల్లో ఈ ఏడాది జూన్‌లో ఆయిల్‌పాం సాగు కింద మొక్కలు నాటాడు. పంట దిగుబడి నాలుగేళ్ల తర్వాత మొదలవుతోంది. 30 ఏళ్ల వరకు కొనసాగుతుంది. ఈ లోపు ఏటా ఖరీఫ్‌లో సోయా, రబీలో శనగ అంతర పంటలుగా సాగు చేస్తున్నాడు ఈయన. ఇతనొక్కడే కాదు.. జిల్లాలో ఇటీవల ఆయిల్‌పాం సాగుకు చాలా మంది రైతులు మొగ్గు చూపుతున్నారు.

- పంట సాగుకు ప్రత్యేక రాయితీలు
- ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం
- ముందుకొస్తున్న రైతులు



తలమడుగు మండలంలోని ఉమడంలో సాగవుతున్న ఆయిల్‌పాం పంట

జిల్లాలో ప్రస్తుతం సాగవుతున్న ఆయిల్ పాం 884 ఎకరాలు
సాగు చేస్తున్న రైతుల సంఖ్య 242
మార్చి నాటికి సాగు లక్ష్యం 2,544 ఎకరాలు

ఇచ్చోడ: జిల్లాలో ఆయిల్‌పాం సాగు పెంపు దిశగా వడివడిగా అడుగులు పడుతున్నాయి. ఇప్పటివరకు ఇక్కడి రైతులు పత్తి, సోయా, కంది, మొక్కజొన్న తదితర సంప్రదాయ పంటలను మాత్రమే సాగు చేస్తున్నారు. అయితే ఇక్కడి నేలలు ఆయిల్‌పాం సాగుకు అనుకూలమని ప్రభుత్వం గుర్తించింది. ఈ మేరకు ఈ సాగును రైతులకు పరిచయం చేసేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టింది. ఇందులో భాగంగా జిల్లాలో ఆయిల్‌పాం నర్సరీని ఏర్పాటు చేసింది. దీర్ఘకాలికంగా దిగుబడి ఇచ్చే ఈ సాగుకు ప్రభుత్వం భారీగా రాయితీలు ప్రకటించి రైతులను ప్రోత్సహిస్తుంది. జిల్లాలో ఇప్పటి వరకు 842 ఎకరాల్లో ఈ పంట సాగవుతుండగా.. ఈ ఏడాది మార్చి నాటికి 2,544 ఎకరాలకు పెంచాలని అధికారులు లక్ష్యం నిర్దేశించుకున్నారు.


భారీగా రాయితీలు..

తేమ శాతం ఎక్కువగా నిల్వ ఉండే భూములు ఆయిల్‌పాం సాగుకు అనువుగా ఉంటాయి. జిల్లాలో ఇలాంటి భూములు ఎక్కువగా ఉండడంతో ప్రభుత్వం ఇక్కడి రైతులను ప్రోత్సహిస్తుంది. డ్రిప్, ఇతర పరికరాల కోసం భారీగా రాయితీలు అందిస్తోంది. ఎకరాకు 50మొక్కల చొప్పున రైతుకు సబ్సిడీ ద్వారా అందజేస్తారు. ఒక్కో మొక్క ధర రూ.193 ఉండగా రైతు కేవలం రూ.20 చెల్లిస్తే సరిపోతుంది. అలాగే డ్రిప్ ఏర్పాటుకు ఐదెకరాల లోపు జనరల్, బీసీ రైతులకు 90 శాతం రాయితీ, ఎస్సీ, ఎస్టీ రైతులకు వందశాతం రాయితీ ఇస్తుంది. నాలుగేళ్ల వరకు పంట దిగుబడి రాకపోవడంతో ఎరువులకు ఎకరాకు ఏడాదికి రూ.4వేల చొప్పున రూ.16వేలు అందజేస్తుంది.

ముప్పై ఏళ్ల పాటు దిగుబడి...

మొక్కలు నాటిన నుంచి నాలుగో సంవత్సరం నుంచి దిగుబడి ప్రారంభమవుతుంది. దిగుబడి మొదలైన తొలిఏడాది ఎకరాకునాలుగునుంచి ఐదు టన్నులు, ఐదో సంవత్సరం నుంచి ఏటా ఒక టన్ను నుంచి రెండుటన్నుల వరకు దిగుబడి పెరుగుతూ వస్తోంది. ఇలా 30 ఏళ్ల పాటు దిగుబడి కొనసాగుతుంది.

లాభాల పంట



ఆయిల్‌పాం మంచి లాభాల పంట. దీనికి ప్రకృతి వైపరీత్యాలు, అడవి జంతువులు, కోతుల నుంచి ఎలాంటి నష్టం ఉండదు. ఒక్కసారి నాటితే 30 ఏళ్ల పాటు దిగుబడి వస్తుంది. నాటిన మొదటి మూడేళ్లు అంతర పంటలు సైతం సాగు వేసుకోవచ్చు. ఈ మేరకు జిల్లాలో రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. – శ్రీనివాస్‌రెడ్డి, ఉద్యానవనశాఖ జిల్లా అధికారి



ముక్కోటి ఏకాదశికి ముస్తాబైన శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం



ఉత్తర ద్వార దర్శనానికి ముస్తాబైన మంగమఠం

'ముక్కోటి' దర్శనానికి సర్వం సిద్ధం

ఆదిలాబాద్: నేడు వైకుంఠ (ముక్కోటి) ఏకాదశి పురస్కరించుకుని శ్రీమహావిష్ణువు దర్శనానికి జిల్లా కేంద్రంలోని వైష్ణవ ఆలయాలు ముస్తాబయ్యాయి. స్థానిక మంగమఠం, శ్రీరామచంద్ర గోపాలకృష్ణమఠం, శ్రీవేంకటేశ్వరాలయంలో నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ రోజున ఉత్తరద్వారం ద్వారా శ్రీమహావిష్ణువును దర్శించుకుంటే మోక్షం లభిస్తుందని భక్తుల నమ్మకం. ఉదయం 5 గంటల నుంచి దర్శనాలు చేసుకోవచ్చని అధికారులు, అర్చకులు పేర్కొన్నారు.



శ్రీవేంకటేశ్వర ఆలయంలోని స్వామివారు

క్లుప్తంగా

ఎస్సారెస్పీ బ్యాక్‌వాటర్‌లో పడి ఒకరి మృతి


మర్రెన్న మృతదేహం

నర్సాపూర్(జి): మండలంలోని టెంబరేణి శివారులో మతిస్థిమితం లేని రిటైర్డు వీఆర్‌ఏ గైని మర్రెన్న (69) ప్రమాదవశాత్తు ఎస్సారెస్పీ బ్యాక్‌వాటర్‌లో పడి మృతి చెందాడు. కుటుంబీకులు, పోలీసులు తెలిపిన వివరాలు.. టెంబరేణి గ్రామానికి చెందిన గైని మరెన్న కొంత కాలంగా మతిస్థిమితం సరిగా లేదు. శుక్రవారం ఇంటి నుంచి బయల్దేరి వెళ్లాడు. కుటుంబ సభ్యులు గాలించగా ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్‌లో ఆదివారం మృతదేహం లభించింది. మతిస్థిమితం సరిగా లేనందున నీట మునిగి మృతిచెంది ఉంటాడని కుమారుడు భోజన్న ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పాకాల గీత తెలిపారు.

అనారోగ్యంలో అమర్‌ఘడ్ పీఠాధిపతి మృతి


శివ్ చరణ్ మహారాజ్ (ఫైల్)

నార్నూర్: మహారాష్ట్రలోని అమర్‌ఘడ్ పీఠాధిపతి శ్రీసంత్ శివ్‌చరణ్ మహరాజ్ (70) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. మండలంలోని రాజులగూడలో గ్రామ పెద్దలు రాథోడ్ డిగాంబర్, సర్పంచ్ రాథోడ్ సావీందర్ ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. అనంతరం అంత్యక్రియలో పాల్గొనేందుకు వారు, భక్తులు మహారాష్ట్రలోని అమర్‌ఘడ్‌కు బయల్దేరారు. రాజులగూడ, నార్నూర్, భీంపూర్, నాగల్‌కొండ, మహాగావ్ తదితర గ్రామాల్లో ప్రతి ఏడాది నిర్వహించే శ్రీ సంత్ ఈశ్వర్‌సింగ్ బాబా పుణ్యతిథి పూజలో పాల్గొని భక్తులకు హితబోధనలు చేసేవారని గుర్తు చేశారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని తిర్పెల్లి ప్రాంతంలో ఆరుగురు పేకాటరాయుళ్లను ఆదివారం అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ ఎస్సై హరిబాబు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. కేటీసీ ట్రాన్స్‌పోర్టు వద్ద పేకాట ఆడుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు దాడి నిర్వహించినట్లు పేర్కొన్నారు. పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులో తీసుకుని, వారి వద్ద నుంచి రూ.13,900 నగదుతోపాటు 52 పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

డివైడర్‌కు ఢీకొని ఒకరికి తీవ్రగాయాలు

భైంసాటౌన్: మండలంలోని మాటేగాం (టోల్ ప్లాజా) వద్ద డివైడర్‌కు ఢీకొన్న ఘటనలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి.. జగిత్యాలకు చెందిన నవీద్‌అలీ ఆదివారం భైంసాలో ఓ శుభకార్యానికి హాజరై తిరిగి బైక్‌పై వెళ్తుండగా రాత్రి 8 గంటల ప్రాంతంలో మాటేగాం వద్ద (టోల్‌ప్లాజా)డివైడర్‌కు ఢీకొని తీవ్రగాయాలపాలయ్యాడు. ఈ ఘటనలో ఎడమ కాలు విరిగిపోయింది. గమనించిన స్థానికులు 108కు సమాచారమివ్వగా, వారు చేరుకుని క్షతగాత్రుడిని భైంసా ఏరియాస్పత్రికి తరలించారు.

బీసీ హాస్టల్ కామటి మృతి


భుజ్జంగిరి మృతదేహం

లక్ష్మణచాంద: మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహంలో కామటిగా పనిచేస్తున్న భుజ్జంగిరి(60) ఆదివారం మృతి చెందింది. సాయంత్రం సమయంలో కిరాయి ఉంటున్న ఇంటి వద్ద మరుగుదొడ్డికి వెళ్లిన సమయంలో గుండెపోటుతో మృతి చెంది ఉంటుందని భావిస్తున్నారు. ఎస్సై రాహుల్ గైక్వాడ్, సర్పంచ్ ముత్యం రెడ్డి సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

‘దత్తత’కు మార్గం సులువు

- అడ్డదారుల్లో ప్రయత్నిస్తే న్యాయపరమైన చర్యలు
- ఆడపిల్లలపై వివక్షతో కొనసాగుతున్న భ్రూణహత్యలు

సంప్రదించాల్సిన నంబర్లు (ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా)

జిల్లా	ఫోన్ నంబర్లు
ఆదిలాబాద్	9440555872, 7095821533, 9440289825
నిర్మల్	8247685975, 9966696464
మంచిర్యాల	9441506519, 9908541697
కొమురంభీం	7780188830, 7013270320



నేరడిగొండ: శిశువు ‘దత్తత’కు ప్రభుత్వం సులువైన మార్గం తీసుకొచ్చింది. పిల్లలు లేని దంపతులు చట్టబద్ధత ప్రకారం పిల్లలను దత్తత తీసుకునే అవకాశం కల్పించింది. గతంలో చాలామంది అడ్డదారులు తొక్కి శిశువులను దత్తత తీసుకున్న ఘటనలు ఉమ్మడి జిల్లాలో చోటుచేసుకున్నాయి. ఇకపై అలాంటి చర్యలకు దిగితే న్యాయపరంగా పోలీసు కేసులు నమోదు చేసే అవకాశాలు ఉన్నాయి. దత్తత కోసం ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. దీంతో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రక్రియను పూర్తిచేసి శిశువును దత్తత తీసుకునే వెసులుబాటు కల్పించింది.

శిశువుల విక్రయాలు

దత్తత పేరుతో గతంలో ఉమ్మడి జిల్లాలోని చాలా ప్రాంతాల్లో శిశువులను విక్రయించిన ఘటనలు చోటుచేసుకున్నాయి. దీంతోపాటు ఆడపిల్లలపై వివక్షతో భ్రూణహత్యలు జరగడంతో పాటు చెత్తకుప్పల్లో పడేస్తున్న విషయం విధితమే. దీన్ని నివారించేందుకు అవగాహన కార్యక్రమాలు చేపట్టినా పూర్తిస్థాయిలో ఫలితం లేకుండా పోయింది. చిన్నారులను దత్తత తీసుకునే ప్రక్రియ గతంలో చాలా సంక్లిష్టంగా ఉండేది. అనేక రకాల పత్రాలు పొందుపర్చాల్సి వచ్చేది. దీంతో చాలా మంది దంపతులు అడ్డదారుల్లో శిశువులను దత్తత తీసునేవారు. అలా కొనుగోలు చేసిన వారిలో చాలా మంది న్యాయ సమస్యలు, కేసులు ఎదుర్కోవాల్సి వచ్చేది.

దత్తత విధానం..

శిశువు దత్తత తీసుకునే దంపతులు ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేస్తే శిశువును దత్తత తీసుకునే చట్టపరమైన అవకాశం ఉంటుంది. దంపతులు, శిశువు వివరాలన్నింటిని గోప్యంగా ఉంచుతారు. దంపతుల ఫొటో, పాన్‌కార్డు, జనన ధ్రువపత్రాలు, నివాస, ఆదాయ, దీర్ఘకాలిక, ప్రాణాంతక వ్యాధులు లేవంటూ వైద్యాధికారి జారీ చేసిన పత్రం, వివాహ రిజిస్ట్రేషన్ తదితర ఆరు రకాల పత్రాలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. దంపతులకు లాగిన్ ఐడీ, పాస్‌వర్డ్ ఇస్తారు. వారి సీనియారిటీ ప్రకారం దరఖాస్తులు ప్రస్తుత దశ తెలుసుకునే అవకాశం ఉంటుంది. మొదట దరఖాస్తు చేసుకున్న వారికి మొదటే దత్తత ఇస్తారు. శిశువు, లింగం వివరాలు, వయస్సు, ఏ ప్రాంతానికి చెందిన శిశువు అవసరం తదితర వివరాలను దరఖాస్తులో నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. గతంలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ కమిషనర్‌కు దత్తత ఇచ్చే అధికారాన్ని ఇటీవల జిల్లా కలెక్టర్‌కు దాఖలు పర్చారు. నూతన విధానం అమలు చేసిన తర్వాత శిశువుల దత్తత కోసం దంపతులు ముందుకొస్తునట్లు అధికారులు పేర్కొంటున్నారు.

కావల్సిన ధ్రువపత్రాలు

శిశువును దత్తత తీసుకునే దంపతులు ఇద్దరు కూడా పలు పత్రాలను సమర్పించాల్సి ఉంటుంది. పాన్ కార్డు, ఆధార్‌కార్డు, ఆదాయ ధ్రువపత్రం, పెళ్లి రిజిస్ట్రేషన్, మెడికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్స్, జనన ధ్రువపత్రాలు, జంట ఫొటోలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ పత్రాలను ఐసీపీఎస్ కార్యాలయంలో సమర్పించాలి. వీటితో పాటు ప్రాజెక్ట్ డైరెక్టర్, డీడబ్ల్యూఅండ్ సీడీఏ ఆదిలాబాద్ పేరిట రూ.6 వేల డీడీ తీయాల్సి ఉంటుంది. cara. nic. in వెబ్‌సైట్ పారెంట్ లాగిన్‌లో రెసిడెంట్ ఇండియన్ పారెంట్స్‌లో దత్తత కోరే తల్లిదండ్రుల వివరాలన్నీ పొందుపర్చాలి. అనంతరం అవసరమైన డాక్యుమెంట్స్ అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. Praspective Adoptive Parents (PAPs) పొందిన యూజర్ ఐడీ, పాస్‌వర్డ్‌ను భద్రపర్చుకొని సీనియారిటీని ఆన్‌లైన్‌లో చెక్ చేసుకోవాల్సి ఉంటుంది. అలాగే దరఖాస్తు చేసుకునే సమయంలో రూ.6 వేలు, దత్తత తీసుకునే సమయంలో రూ.40 వేలు, దత్తత పొందిన ఆరు నెలలకు రూ.8 వేలు ప్రభుత్వానికి డీడీ రూపంలో చెల్లించాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

దత్తత కోసం ఇప్పటివరకు 269 దరఖాస్తులు

జిల్లా కేంద్రంలో 2005లో శిశుగృహను ఏర్పాటు చేశారు. శిశువుల దత్తత కోసం ఇప్పటివరకు 269 మంది దంపతులు దరఖాస్తులు చేసుకున్నారు. 108 మంది శిశువులను దత్తత ఇచ్చారు. 73 మంది బాలికలు, 36 బాలుర శిశువులను అందజేశారు. మరో 183 మంది వెయిటింగ్‌లో ఉన్నారు. ఇందులో 96 మంది శిశువులను భారతదేశానికి, 12 మందిని ఇతర దేశాలకు దత్తత ఇచ్చారు.

పారదర్శకంగా ప్రక్రియ



దత్తత ప్రక్రియ పారదర్శకంగా ఉంటుంది. శిశువును దత్తత తీసుకునే వారు మొదట ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. పైరవీలకు ఆస్కారం లేకుండా చూస్తున్నాం. సీరియల్ ప్రకారం పక్షపాతం లేకుండా దరఖాస్తు చేసుకున్న వారికి ప్రాధాన్యత ఇస్తాం. దరఖాస్తు పరిశీలన అనంతరం చిన్నారులను దత్తత తీసుకునే అవకాశం ఉంటుంది.

– రాజేంద్రప్రసాద్, డీసీపీఓ, ఆదిలాబాద్

జలపాతం వద్ద భద్రతా చర్యలు శూన్యం


జలపాతం గుండం వద్ద పర్యాటకులు

బోథ్: మండలంలోని పొచ్చర జలపాతం వద్ద భద్రతా చర్యలు కనిపించడం లేదు. పర్యాటకులు జలపాతం దగ్గరగా గుండం వద్దకు వెళ్తున్నారు. ఫొటో, వీడియోలు తీసుకుంటున్నారు. అయితే కాలుజారితే నేరుగా జలపాతంలో పడే అవకాశం ఉంది. ఇటీవల ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇక్కడ చాలామంది మద్యం తాగి డీజే సౌండ్స్ మధ్య నృత్యాలు చేస్తున్నారు. జలపాతం వద్ద అధికారులు భద్రత చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

మహారాష్ట్రలో పార్టీ బలోపేతానికి కృషి


ఎమ్మెల్యేతో భేటీ అయిన మహారాష్ట్ర మాజీ ఎమ్మెల్యే రాజు తొడసం

ఆదిలాబాద్‌టౌన్: బీఆర్‌ఎస్ పార్టీని మహారాష్ట్రలో బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగురామన్న అన్నారు. ఆదివారం స్థానిక డీసీసీబీ కార్యాలయంలో మహారాష్ట్రకు చెందిన బీజేపీ మాజీ ఎమ్మెల్యే రాజు తొడసం ఎమ్మెల్యే జోగు రామన్నతో భేటీ అయ్యారు. త్వరలో మహారాష్ట్రలో ముఖ్యమంత్రి కేసీఆర్ పర్యటన, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, బీజేపీ వైఫల్యాలపై వారు చర్చించారు.జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, డీసీసీబీ చైర్మన్ భోజారెడ్డి, దుర్గం శేఖర్ పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి


కేక్ కట్ చేస్తున్న ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డి

- ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డి

ఉట్నూర్: ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఏజెన్సీ ప్రాంతాల్లోని ఆదివాసీ గిరిజనుల అభివృద్ధి కోసం అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డి అన్నారు. ఐటీడీఏ కార్యాలయంలో ఆదివారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ ఐటీడీఏ ద్వారా అందించే సంక్షేమ ఫలాలు గిరిజనులకు అందేలా చూడాలని అన్నారు. వారి సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం బంజారా రచయితల వేదిక క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏపీవో పీటీజీ భాస్కర్, ఎస్‌డీసీ వెంకటేశ్వర్లు, జీసీసీ డీఎం రామానందం, హెచ్‌వో సుధీర్, డీపీవో ప్రవీణ్, ఏవో రాంబాబు, ఆయా విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ముఖరా(కె) గ్రామాన్ని ఆదర్శంగా తీసుకోవాలి


మంత్రి దయాకర్‌రావును కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న సర్పంచ్ మీనాక్షి

ఇచ్చోడ: ముఖరా(కె) గ్రామాన్ని పల్లెలు ఆదర్శంగా తీసుకోవాలని రాష్ట్ర పంచాయతీ రాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లో మంత్రిని సర్పంచ్ గాడ్గే మీనాక్షి, ఎంపీటీసీ గాడ్గే సుభాష్‌లు మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్చం అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖరా(కె) గ్రామంలో పల్లెప్రగతి, సేకరించిన తడిపొడి చెత్తతో వచ్చిన ఆదాయంతో సోలార్ విద్యుత్ దీపాలు ఏర్పాటు, విద్యుత్‌ను ఆదా చేసుకుని గ్రామం రాష్ట్రంలో ఆదర్శంగా నిలుస్తోందన్నారు. గ్రామంలో తయారు చేసిన వర్మీ కంపోస్టును మంత్రికి అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్, ఎంపీటీసీని మంత్రి అభినందించారు.

సావిత్రీబాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహిద్దాం

- మాలీ మహా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ పేట్కులే

ఆదిలాబాద్‌రూరల్: భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రీబాయి పూలే 192వ జయంతిని ఈనెల 3న ప్రతి గ్రామంలో ఘనంగా నిర్వహించడంతోపాటు జిల్లాకేంద్రంలో బహిరంగ సభను విజయవంతం చేయాలని అఖిల భారతీయ మాలీ మహా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ పేట్కులే కోరారు. జిల్లాకేంద్రంలోని పూలే గెస్ట్‌హౌజ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన జిల్లా పటేళ్ల సంఘం, మాలీ ఉద్యోగ సంఘం, మహా సంఘం జిల్లా కమిటీ ఎన్నికల్లో ఎన్నికైన కార్యవర్గ సభ్యుల సన్మాన సభలో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సీఎం కేసీఆర్ ఇచ్చిన మాట ప్రకారం 10 శాతం గిరిజన రిజర్వేషన్లలో చోటు కల్పించి మాలీలకు ఎస్టీ హోదా కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్రప్రధాన కార్యదర్శి సాంబన్న షిండే, రాష్ట్ర కోశాధికారి సతీశ్ గురునులే తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పటేళ్ల సంఘం నూతన కమిటీ

జిల్లా పటేళ్ల సంఘం అధ్యక్షుడిగా రాగి గంగారం, ప్రధాన కార్యదర్శిగా భాస్కర్ లేనిగురి, ఉపాధ్యక్షుడిగా వినోద్ గురునులే, కోశాధికారిగా ఉత్తం నాగోషే, సంయుక్త కార్యదర్శిగా చౌదరి ఆశన్న, ప్రచార కార్యదర్శిగా గంగారాం ప్రధాన్, సభ్యులుగా అమత్ గురునులే, రాములు, షిండే గంగారం గురునులే, శంకర్ గురుణులే, సదాశివార్పురి, గణపతి నాగోషి ఎన్నికయ్యారు.

మాలీ మహా సంఘం జిల్లా కార్యవర్గం..

మాలీ మహా సంఘం అధ్యక్షుడిగా వాడగురే విజయ్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా వాడగురే ఉత్తం, ఉపాధ్యక్షుడిగా విఠల్ కోట్రంగి, జిల్లా కోశాధికారిగా శివాజీ గురునులే, ప్రచార కార్యదర్శిగా ఉత్తం మాందాడే, కార్యవర్గ సభ్యులుగా గజానన్ ముహుర్లే, నారాయణవాడై, భారత్ మొహార్లే, వివేక్ వాడయ్, అంబాదాస్ షిండే, లక్ష్మణ్ సెండేలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

మాలీ ఉద్యోగుల సంఘం జిల్లా కమిటీ..

అధ్యక్షుడిగా ఏ.చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శిగా డి.శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా కె.అనిల్, సంయుక్త కార్యదర్శి ఎస్.సత్యనారాయణ, కోశాధికారిగా పి.భాస్కర్, ప్రచార కార్యదర్శిగా ఏ.దేవిదాస్, మహిళా ఉపాధ్యక్షుడిగా పెట్టుకులే కల్పన, కార్యదర్శిగా బోరులే అనిత, కార్యవర్గ సభ్యులుగా జి.అంబాదాస్, పి.ఉత్తంలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

చెరువులో దూకి ఒకరి ఆత్మహత్య

చెన్నూర్: పట్టణంలోని కుమ్మరిబొగుడ కాలనీకి చెందిన బజ్జూరి మొగిలి (48) కడుపునొప్పి భరించలేక పెద్ద చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం... మొగిలి కొంతకాలంగా కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. మందులు వాడిన నొప్పి తగ్గలేదు. మనస్తాపంతో ఆదివారం పెద్ద చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి కుమారుడు కిశోర్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ కుమారస్వామి తెలిపారు.

6న ఖండేవ్ మహాజాతర పూజ


మాట్లాడుతున్న సర్పంచ్ గజానంద్‌నాయక్

నార్నూర్: ఈనెల 6న పుష్యపౌర్ణమి సందర్భంగా ఆదివాసీ గిరిజనులైన తొడసం వంశస్తుల ఆరాధ్యదైవం ఖండేవ్ మహాజాతర పూజకు నిర్ణయం తీసుకున్నామని ఆలయ కమిటీ సభ్యుడు తొడసం నాగోరావు, సర్పంచ్ బానోత్ గజానంద్‌నాయక్ అన్నారు. మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆదివారం ఖండేవ్ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తొడసం వంశస్తులు, గ్రామపెద్దలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహాపూజతోపాటు 15 రోజుల జాతర నిర్వహణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించినట్లు తెలిపారు. 6న మహాపూజ చేయాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాలు, ప్రాంతాల నుంచి వచ్చే ఆదివాసీ గిరిజనులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించినట్లు తెలిపారు. తాగునీటి సమస్య ఉన్న నేపథ్యంలో భగీరథ ద్వారా పైపులైన్ ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అందరి సహకారంతో జాతరను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో గ్రామపెద్దలు మెస్రం రూప్‌దేవ్, ఐటీడీఏ పాలక మండలి డైరెక్టర్ మాడవి మాన్కు, పీఏసీఎస్ చైర్మన్ అడే సురేశ్, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు ఉర్వేత రూప్‌దేవ్, బీజేపీ మండల అధ్యక్షుడు తొడసం బండు, నాయకులు రాథోడ్ ఉత్తం, బాబాఖాన్, ఉప సర్పంచ్ చౌహాన్ మహేందర్ పాల్గొన్నారు.

జంగుబాయి దర్శనానికి బయల్దేరిన ఆదివాసీలు


కాలినడకన బయల్దేరి వెళ్తున్న ఆదివాసీలు

నార్నూర్: కెరమెరి మండలం పరందోలి అటవీ క్షేత్రంలో ఉన్న ఆదివాసీ గిరిజనుల ఆరాధ్యదైవం జంగుబాయి దర్శనానికి ఆదివాసీ గిరిజనులు బయల్దేరారు. ఎడ్లబండిపై కొందరు, మరికొందరు కాలినడకన సంప్రదాయ పాటలు పాడుతూ వెళ్లారు. మండలంలో నుంచి కాక గాదిగూడ, ఇంద్రవెల్లి, ఉట్నూర్, బేల, సిరికొండ, ఇచ్చోడ తదితర మండలాల నుంచి ఆదివారం తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల పటేళ్లు మాట్లాడుతూ జంగుబాయిని ఏడాదికోసారి సంప్రదాయ పూజలు నిర్వహించి మొక్కు తీర్చుకుంటే మంచి జరుగుతుందన్నారు. ప్రతి ఏడాది కుటుంబ సమేతంగా బయల్దేరుతామన్నారు. జంగుబాయి దైవ దర్శనానికి వెళ్లే భక్తులకు ఆదివాసీ గ్రామాల్లో తాగునీటిసౌకర్యాలు కల్పించడానికి ఏర్పాట్లు చేస్తామని మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తొడసం నాగోరావు తెలిపారు.

క్రీడారత్నాలు ‘గిరి’బిడ్డలు

- రాష్ట్రస్థాయి పోటీలో ప్రతిభ
- చదువు, ఆటల్లోనూ సత్తా


రాష్ట్రస్థాయి పరుగు పందెంపోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు (ఫైల్)

ఇచ్చోడ: పేద, వ్యవసాయ కుటుంబాలకు చెందిన గిరిజన బిడ్డలు ఆటల్లో రాణించి సత్తాచాటుతున్నారు. జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరుస్తున్నారు. జిల్లాలోని ఇచ్చోడ గిరిజన గురుకుల బాలికల, పాఠశాల విద్యార్థులు క్రీడాపోటీల్లో పాల్గొని అందరినీ అబ్బురపరుస్తున్నారు. గురుకులాల్లో చదువుతూ, ఆటల్లో రాణిస్తున్న విద్యార్థులపై సాక్షి కథనం.

జాతీయస్థాయికి ఎదగడమే నా లక్ష్యం



జిల్లా, రాష్ట్రస్థాయిలో బహుమతులు సాధించా. పోటీల్లో పాల్గొని జాతీయ స్థాయి క్రీడాకారిణిగా ఎదగాలనేది నా లక్ష్యం. చేగుంటలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో పరుగు పందెంలో అండర్–18లో ప్రథమ బహుమతి లభించింది. భద్రాచలంలో జరిగిన ఇంటర్ సొసైటీలీగ్ పోటీల్లో స్వర్ణ పతాకం సాధించా.

– అదే వైష్ణవి, 9వ తరగతి

ఒలింపిక్స్‌లో చోటు దక్కేలా



ఒలింపిక్స్‌లో చోటు దక్కేలా సాధన చేస్తా. గత వారం జిల్లాస్థాయి పోటీల్లో 4 కి.మీ పరుగు పందెంలో ప్రథమ స్థానంలో గోల్డ్‌మెడల్ సాధించా. ప్రాథమిక స్థాయి నుంచి పరుగు పందెంలో బహుమతులు సాధిస్తూనే ఉన్నా. గోల్డ్‌మెడల్ సాధనతో నాలో మరింత పట్టుదల పెరిగింది.

– ప్రవళిక, ఇంటర్ ద్వితీయ సంవత్సరం

వేర్వేరు కారణాలతో ముగ్గురి ఆత్మహత్య

వేర్వేరు కారణాలతో ముగ్గురు ఆత్మహత్య చేసుకున్నారు. అప్పుల బాధతో లక్ష్మణచాంద మండలం కాశిగూడకు చెందిన సయ్యద్ సద్దాం, భార్య కాపురానికి రావడం లేదని భీంపూర్ మండలం నిపాని గ్రామంలో మానేరు వెంకట్ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. అప్పు తీర్చే మార్గం లేక భైంసా మండలం మాంజ్రి గ్రామానికి చెందిన మాధవ్‌రావు ఉరివేసుకుని చనిపోయాడు.

పురుగుల మందు తాగి ఒకరు..


సయ్యద్ సద్దాం మృతదేహం

లక్ష్మణచాంద: పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మృతుడు మండలంలోని కాశిగూడ గ్రామానికి చెందిన సయ్యద్ సద్దాం (33). ఈయన గత రెండేళ్ల కిందట ట్రాక్టర్ కొనుగోలు చేశాడు. అప్పులు కావడంతో నర్సాపూర్ గ్రామానికి చెందిన నర్సారెడ్డి వద్ద ట్రాక్టర్ తాకట్టు పెట్టి అప్పు తీసుకున్నాడు. అందులో నుంచి కొన్ని డబ్బులు ఇచ్చాడు. మిగిలిన డబ్బులు ఇవ్వకపోవడంతో నర్సారెడ్డి వేధించసాగాడు. తీవ్ర మనస్థాపం చెందిన సద్దాం గతనెల 29న గ్రామ సమీపంలో పురుగుల మందు తాగాడు. అప్పటి నుంచి జిల్లా కేంద్రంలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. భార్య జరీనా ఫిర్యాదుతో నర్సారెడ్డిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడు సద్దాంకు ముగ్గురు పిల్లలు ఉన్నారు.

భార్య కాపురానికి రావడం లేదని..


వెంకట్(ఫైల్)

తాంసి: భార్య కాపురానికి రావడం లేదని పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన భీంపూర్ మండలం నిపాని గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మానేరు వెంకట్(30) కూలీ పనిచేసుకుంటూ కుటుంబాన్ని పోషించేవాడు. ఈ క్రమంలో గత కొన్నినెలలుగా మద్యానికి బానిసయ్యాడు. కూలీ పనులకు వెళ్లడం లేదు. దీంతో గత మూడు నెలల క్రితం భార్య పుట్టింటికి వెళ్లింది. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన వెంకట్ శనివారం రాత్రి ఇంటి వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం ఉదయం గ్రామస్తులు కుటుంబసభ్యులు, పోలీసులకు సమాచారం అందించారు. భీంపూర్ ఎస్సై రాధిక మృతదేహన్ని పరిశీలించి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. మృతుడి తల్లి అమ్మక్క ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి ఐదేళ్ల కుమారుడు ఉన్నాడు.

అప్పులు తీర్చలేక..


మాధవ్‌రావు(ఫైల్)

భైంసారూరల్: అప్పులు తీర్చే మార్గం లేక ఒకరు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండలంలోని మాంజ్రి గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన మాధవ్‌రావు(30)కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. తనకున్న మూడెకరాల వ్యవసాయ భూమిలో పంటలు సాగు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. పిల్లల చదువులు, కుటుంబపోషణ, ఇతరాత్ర నిర్వహణ కోసం అప్పులు పెరిగాయి. గత కొంతకాలంగా అప్పులు ఎలా తీర్చాలని తనకు తెలిసిన వారితో చర్చించేవాడు. అప్పులు తీర్చే మార్గం లేక మదనపడేవాడు. ఈక్రమంలో శనివారం పంటచేనుకు నీటి తడిపెడుతానని చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. ఎంత సేపటికి రాకపోవడంతో కుటుంబీకులు వెళ్లి చూసే సరికి పొలంలో ఉరివేసుకుని విగతజీవిగా పడి ఉన్నాడు. భార్య శారద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.